సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం। 16। సెప్టెంబర్। 2025



మెడికల్ సీట్లను వెనక్కి పంపిన దద్దమ్మ ప్రభుత్వం

పులివెందుల మెడికల్ కళాశాలకు 50 సీట్లు మంజూరైతే.. వెనక్కి పంపిన దద్దమ్మ ప్రభుత్వ మిదని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. - 8లో



విద్యార్థి జీవితం అంధకారం

ఓ విద్యార్థి నిండు జీవితాన్ని, ఉజ్వల భవిష్యత్తును అంధకారం చేసిన ఘటనపై..తక్షణమే స్పందించాల్సిన కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.190
రెండోరకం	రూ.100	రూ.150



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 121 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	700	700
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 241.120 కిలోలు

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



అజ్మత్ అలీని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని కాటిమాయకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అజ్మత్ ఆలీ రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక య్యాడు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు తెలిపారు.ఈ నెల 12వ తేదీ కడప డీఎస్‌ఏ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్–14 విభాగంలో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ పోటీలో ఎస్. అజ్మత్ అలీ ప్రతిభ కనబ రిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడని తెలిపారు. పీడి రమేష్ నాయక్‌ను కూడా ప్రధానోపాధ్యాయుడు అభినందించారు.

పోస్టర్ ఆవిష్కరణ

రాయచోటి : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు నిర్వహించే జాతీయ పశు వ్యాధి నివారణ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ పిలుపునిచ్చారు. గాలికుంటువ్యాధికి ఇంటి వద్దనే పశువులకు టీకాల పంపిణీ జరుగుతుందని జేసీ తెలిపారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం పోస్టర్‌ను జేసీ ఆవిష్కరించారు. పశువులకు సకాలంలో టీకాలు వేయడం ద్వారా ఎన్నో వ్యాధులను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్‌పిళ్ళై వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో ప్రతిభ

– ఒకే సారి రెండు ఉద్యోగాలకు ఎంపిక



గురు గోవర్ధన్

కడప ఎడ్యుకేషన్ : కష్ట పడితే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించాడు కడపకు చెందిన మేకల గురు గోవర్ధన్ యాదవ్. తన మొదటి ప్రయతనంలోనే ఒకేసారి టీచర్ ఉద్యోగంతోపాటు సివిల్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. ప్రతికూల పరిస్థితుల్లోనూ తన లక్ష్యం వైపు ప్రణాళికతో ముందుకు సాగి విజయం సాధించాడు. మేకల గురు గోవర్ధన్ యాదవ్.76.436 మార్కులతో 200 ర్యాంకుతో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు.మా అమ్మగారి కోరిక మేరకు కష్టపడి చదివి టీచర్ ఉద్యోగం సాధించినట్లు గోవర్ధన్ తెలిపారు. పేద విద్యార్థులకు మంచి విద్యను అందిస్తూనే తీరిక సమయంలో గ్రూప్–1 చదువుతానని పేర్కొన్నారు.

అక్షరమే ఆయుధం



ప్రజాస్వామ్యం ఖూనీ



ప్రజలకు వాస్తవాలను తెలిపే పత్రికలపై కూటమి ప్రభుత్వం కేసులు పెట్టడం, దాడులు చేయడం, వేధించడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ప్రభుత్వాలు శాశ్వతం కాదు. పత్రికా స్వేచ్ఛను హరిస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదం తలెత్తుతుంది. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా తప్పును తెలుసుకోవాలి. సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డితో పాటు ఇతర విలేకరులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి. – ఆర్ రమేష్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, లక్కిరెడ్డిపల్లె

కేసులు పెట్టడం సరికాదు



అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకున్న కూటమి ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది. ప్రభుత్వ వ్యవస్థలో లోటుపాట్లను ప్రజలకు చూపిస్తుంటుంది. ఒక రాజకీయ నాయకుడు తమ పార్టీ విధానం మేరకు మాట్లాడితే దాన్ని ప్రచురించడాన్ని ప్రభుత్వం తప్పుగా చిత్రీకరించడం, కేసులు నమోదు చేయడం సరికాదు. వెంటనే సాక్షి ఎడిటర్‌పై కేసులను ఎత్తివేయాలి.

– మూలె సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, జమ్మలమడుగు

నివేదనలే..పరిష్కారం లేదు

- ఎంతో ఆశతో కలెక్టరేట్‌కు వస్తున్న బాధితులకు జరగని న్యాయం
- ప్రజా వేదికకు భూములకు సంబంధించిన ఫిర్యాదుదారుల అధికం



రైతులకు గిట్టుబాటు ధరను కల్పించాలని డీఆర్వోకు వినతిపత్రం సమర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

సాక్షి రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పరుగులు పెడుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో నమ్మకం సన్నగిల్లుతోంది. అధికారం అండగా...ఆగడాలు మెండుగా...జిల్లాలో కొనసాగుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు సైతం కలెక్టరేట్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కూర్చొనేందుకు కూడా బరువుగా భావిస్తుండడంతో బాధితులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాకుండా తల్లడిల్లిపోతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులకు న్యాయం మాత్రం కొండంత దూరంలో కనిపిస్తోంది. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ నిర్వహించే అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వచ్చి గోడు వెళ్లబోసుకునేందుకు బారులు తీరుతున్నారు. ప్రతిసారి వచ్చినవారే మళ్లీమళ్లీ వస్తున్నారు. కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలుచేస్తున్నారు. కొత్త కలెక్టర్ రాకతోనైనా తమ సమస్యలు తీరుతాయని బాధితులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

న్యాయం కోసం

జిల్లాలోని అటు తంబళ్లపల్లె, ఇటు రైల్వేకోడూరు, మదనపల్లె, రాజంపేట ఇలా చెబుతూపోతే దూర ప్రాంతాల నుంచి ఎన్నో ఆశలతో కలెక్టరేట్‌కు కదులుతున్నారు. కానీ పెన్షన్లు, ఇతరత్రా చిన్నపాటి సమస్యలకు కూడా ఒక్కోసారి పరిష్కారం గగనంగా మారుతోంది. ఎక్కువగా రెవెన్యూకు సంబంధించి ఆన్‌లైన్, అధికార పార్టీ నేతల కబంధ హస్తాల్లో చిక్కుకున్న స్థలాలను విడిపించమని, ఇతరత్రా దాడులు, వాటిపై ఫిర్యాదులు వస్తున్నాయి. దివ్యాంగులు, వృద్ధులు, ఇతర వ్యక్తిగత సమస్యలతో ప్రతి సోమవారం 250-300 మంది వరకు వస్తున్నారు. ప్రధానంగా ఇంటి పట్టా, ఆన్‌లైన్ సమస్యలు, భూ కబ్జాలు, ఉద్యోగాలు, రుణాల కోసం, పరిహారం ఇలా అనేక సమస్యలతో కలెక్టరేట్‌కు న్యాయం కోసం వస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించి జిల్లా స్థాయి ఉన్నతాధికారులు కూడా డుమ్మా కొడుతుండడం..... కిందిస్థాయి సిబ్బందిని కార్యక్రమానికి పంపుతుండడంతో సమస్యల పరిష్కారం గగనంగా మారింది.

కొత్త కలెక్టర్‌పైనే ఆశలు

జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు భారీగా బాధితులు వస్తున్నా న్యాయం జరగలేదని బహిరంగంగానే చెబుతున్నారు. జేసీ ఆదర్శ రాజేంద్రన్‌తోపాటు కొంత మంది అధికారులు సమస్యల పరిష్కారంలో కొంత మేర కృషి చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌పై ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా జిల్లాలో అధికార పార్టీ నాయకుల భూ ఆక్రమణలతోపాటు రెవెన్యూలో ఆన్‌లైన్, దాడులతో బెంబేలెత్తించడం, ఇతరుల భూములు లాక్కోవడం, ప్రభుత్వ భూములను కబ్జా చేయడం ఎక్కువైంది. ఇప్పటికే ఇలాంటి వ్యవహారాలై మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రాజంపేట తదితర ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి ఆక్రమణలపై ఫిర్యాదులు కూడా చేశారు. కొత్త కలెక్టర్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో మళ్లీ వచ్చి ఫిర్యాదు చేసేందుకు బాధితులు సిద్ధమౌతున్నారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ అనేక వ్యవహారాలపై మార్పునకు కృషి చేస్తారని జిల్లా వాసులు ఆశిస్తున్నారు.

టమాట, బొప్పాయికి గిట్టుబాటు ధర కల్పించాలి

టమాట, బొప్పాయికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అప్పుల పాలయ్యారు. మార్కెట్‌లో దళారీ వ్యవస్థ కారణంగా అన్నదాతలు మోసపోతున్నారన్నారు. టమాట, బొప్పాయి పండ్లను మార్కెట్‌కు తీసుకెళ్లినా అమ్ముడుపోక రోడ్లమీద పారవేయాల్సి వస్తోంది. పంటలకు గిట్టుబాటు లేకపోవడంతో ఆత్మహత్యల వరకు పరిస్థితులు వెళుతున్నాయి. ఇప్పటికైనా రైతాంగాన్ని ఆదుకునే చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరుతున్నారు.

ఆన్‌లైన్ కోసం తిరుగుతున్నా!



నా పేరు సఫియాబీ. పీలేరు మండలం జాండ్ల గ్రామానికి చెందిన తనకు 1.5 ఎకరాల భూమి ఉంది. ఆన్‌లైన్ కోసం ఆరు నెలలుగా తిరుగుతున్నాను. పీలేరు తహసీల్దార్ పట్టించుకోవడం లేదు. నేను లేని సమయంలో మా పక్క భూమి వాళ్లు ఆన్‌లైన్ చేసుకున్నారు. జరిగిన తప్పును గుర్తించి తనకు న్యాయం చేయాలి.

సమస్య పరిష్కరించాలి



నా పిత్రార్జితం వారసత్వ రీత్యా లభించిన భూమికి సంబంధించి 1బీ అడంగల్, పాసు పుస్తకం మంజూరు చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. అయినా ఫలితం లేదు. నాసమస్యను సత్వరమే పరిష్కరించాలి.

– డి.సుధాకర్, బూర్లపల్లి కస్బా, పెద్దతిప్పసముద్రం మండలం

ఇంటి బిల్లు మంజూరు చేయాలి



తనకు ప్రభుత్వం ఇంటి పట్టా మంజూరు చేసింది. అప్పు చేసిన పునాది వేసి వేసుకున్నాను. అందుకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయలేదు. కళ్లు సరిగా కనిపించకున్నా 6నెలలుగా తిరుగుతున్నాను. సత్వరమే బిల్లు మంజూరు చేయాలి. - రెడ్డెప్ప, గుట్టపల్లిసోమవరం, సంబేపల్లె మండలం

నూతన ఎస్పీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న ఎస్పీ ధీరజ్ కనుబిల్లి

రాయచోటి : అన్నమయ్య జిల్లా నూతన ఎస్పీగా ధీరజ్ కనుబిల్లి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఉదయం రాయచోటిలోని జిల్లా ప్రధాన కార్యాలయానికి చేరుకున్న ఎస్పీకి పోలీసు యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. ఈ సందర్భంగా తన సతీమణితో కలిసి ఎస్పీ బాధ్యతలను స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా ఎస్పీగా పనిచేసిన విద్యాసాగర్ నాయుడు కృష్ణాజిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహించిన ధీరజ్ కనుబిల్లి ఇక్కడి వచ్చారు. ఈ సందర్భంగా ఏఆర్ సిబ్బందితో ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు.

నేపథ్యం ఇదీ..

ధీరజ్ కనుబిల్లి 2020 బ్యాచ్‌లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. 2021లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. వీరి తల్లి పార్వతీ (గృహిణి), తండ్రి కె వెంకటరమణ. అడిషనల్ ఎస్పీగా శ్రీకాకుళం జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. ఐఏఎస్‌గా ఎంపికైనా తన తండ్రిని స్ఫూర్తిగా తీసుకొని ఐపీఎస్‌గా కొనసాగుతున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.ఎస్పీని జిల్లా అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే, మదనపల్లె డీఎస్పీ ఎస్ మహేంద్ర, రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ ఎం శ్రీనివాసులు కొత్త ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా ప్రత్యేకతను కాపాడతాం....

రాయచోటి : జిల్లా ప్రత్యేకతను కాపాడటంతో పాటు శాంతి భద్రతల విషయంలో నిక్కచ్చిగా విధులు నిర్వర్తిస్తామని నూతన ఎస్పీ ధీరజ్ కనుబిల్లి పేర్కొన్నారు. సోమవారం ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలు, మహిళల సంరక్షణ, సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాల నిర్మూలన, ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను చట్టపరంగా వేగంగా పరిష్కరిస్తామని తెలిపారు.

ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపట్ల అలసత్వం చేయకుండా చట్టపరిధిలో పరిష్కారం చూపాలని జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఎస్పీ ధీరజ్ కనుబిల్లి ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు.

17 నుంచి స్వస్థ నారీ సశక్త్ అభియాన్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య

రాయచోటి టౌన్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమశాఖ ద్వారా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు చేపట్టిన స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ కె. లక్ష్మీనరసయ్య పేర్కొన్నారు. సోమవారం జిల్లా స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఇల్లు, సమాజం, సాధికారత మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా మహిళలకు, పిల్లలకు మెరుగైన ఆరోగ్యాన్ని సమకూర్చడమే ధ్యేయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ని వైద్య కేంద్రాల నుంచి జిల్లా స్థాయి ఆరోగ్య కేంద్రాల వరకు వైద్యాధికారులందరూ సమన్వంతో పని చేయాలని సూచించారు.

డీఎస్సీలో మూడో ర్యాంక్ సాధించిన హేమలత



హేమలత

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలోని రామేశ్వరానికి చెందిన హేమలత 43 ఏళ్ల వయసులో డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు విభాగంలో మూడో ర్యాంక్, టీజీటీ ఇంగ్లీషులో 17వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను 2004లో ఎంఎస్సీ బయోటెక్నాలజీ పూర్తి చేశానన్నారు. వివాహం అయ్యాక తన భర్త పల్లేటి శ్రీనివాసులరెడ్డి ప్రోత్సాహంతో బీఈడీ పూర్తి చేసి ప్రైవేట్‌స్కూల్ టీచర్‌గా పనిచేశానన్నారు. 2012 డీఎస్సీలో సైన్స్ సబ్జెక్టు దరఖాస్తు చేసినప్పుడు డిగ్రీలో తన సబ్జెక్టులు బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ కావడం, బోటని లేదా జువాలజీ ఉండాలన్న నియమంతో తన దరఖాస్తు రిజెక్ట్ అయిందన్నారు. తర్వాత ఎంఏ ఇంగ్లీషు పూర్తి చేసి 2018 డీఎస్సీలో 20వ ర్యాంకు సాధించాను. కానీ కేవలం రెండే పోస్టులు ఉండటంతో తనకు జాబ్ రాలేదన్నారు. అనంతరం ఇంటర్ కాలజీ ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేస్తూ 2025 డీఎస్సీకి ప్రయత్నించి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషులో 3వ ర్యాంక్, టీజీటీ ఇంగ్లీషులో 17వ ర్యాంక్ సాధించానన్నారు. ఎంఈడీ కూడా పూర్తి చేశానన్నారు. వ్యవసాయం చేస్తూ తనకు సహాయ సహకారాలు అందించిన తన భర్త ప్రోత్సాహాన్ని, తన తల్లి సహకారాన్ని మరువలేనన్నారు.

ఊరికి దారి దొరికింది..

ఉపకారికి బిల్లు దక్కలేదు!

- 200 సంవత్సరాలుగా ఉన్న సమస్య
- వంక వస్తే అంత్యక్రియలకు ఆటంకం
- వంక నీళ్లలోనే మృతదేహాలను వదిలేసే దుస్థితి
- చదువులకూ తప్పని తిప్పలు
- వైఎస్ జగన్ హయాంలో వంతెన నిర్మాణం
- తొలగిన అన్ని ఇబ్బందులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు
- బిల్లులు మంజూరు కాకపోవడంతో కోర్టు మెట్లెక్కిన వైనం



వైఎస్ జగన్ హయాంలో వంకకు అడ్డుగా నిర్మించిన వంతెన

కడప సిటీ : ఆ గ్రామం ఏర్పడి 200 సంవత్సరాలు పైబడి అయ్యింది. రాకపోకలకు గ్రామసమీపాన ఉన్న మొగమూరు వంక ప్రవాహంతో సమస్యలు తీవ్రతరంగా ఉండేవి. ఈ వంక పెద్ద ఎత్తున ప్రవహిస్తే మూడు రోజుల వరకు అన్ని కార్యకలాపాలు స్తంభించిపోయేవి. ఈ సమయంలో ఆ గ్రామంలో ఎవరైనా చనిపోతే మృతదేహాలను వంకలో ప్రవహించే నీటిలోనే వదిలేసే దుస్థితి. ఆ గ్రామంలో చదువుతున్న విద్యార్థులకు కూడా ఈ వంక ప్రవాహం పెద్ద ఆటంకంగా మారి చదువులు కుంటుపడేవి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అప్పటి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి చొరవతో ఆ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బత్తల వీరయ్య యాదవ్ వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీంతో ఆ గ్రామానికి ఉన్న సమస్యలన్నీ తీరిపోయాయి. ఇది ఎక్కడో మారుమూల పల్లె కాదు... వైఎస్సార్ కడప జిల్లాలోని మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెకు అతి దగ్గరలో ఉన్న ఓబుల్‌రెడ్డిపల్లె.

200 సంవత్సరాలుగా ఉన్న సమస్య

ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామం ఏర్పడి 200 సంవత్సరాలకు పైగా అయ్యింది. అప్పటి నుంచి 2023 వరకు ఆ గ్రామ సమీపంలోని మొగమూరు వంక ప్రభావంతో వర్షాకాలంలో అన్ని విధాలుగా ఇబ్బందులు ఉండేవి. అప్పటి నుంచి 2022 వరకు ఆ గ్రామ సమస్యను ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రధాన రహదారికి దగ్గరలో ఉన్న గ్రామమైనప్పటికీ ఏ నాయకులు వారి సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపలేదు.

పద్మవ్యూహంలాంటిది

ఈ వంక వస్తే ఓబుల్‌రెడ్డిపల్లె వాసులకు అభిమన్యుడు పద్మవ్యూహంలో చిక్కుకున్నట్లు ఉండేది. అటు పాలగిరికి వెళ్లి మెయిన్‌రోడ్డుకు వచ్చేందుకు యేరు అడ్డు పడేది. నాగూరు మీదుగా వెళ్లి వేంపల్లెకు వెళ్లాలంటే పాములూరు వంక అడ్డుగా ఉండేది. ఈ వంక ప్రవాహం వస్తే ఎటువంటి రాకపోకలకు అవకాశమే లేదు. వంక ప్రవాహం తగ్గినంత వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేది.

గొర్రెల కాపరులకు తప్పిన ప్రమాదం

2022 నవంబరులో ఓబుల్‌రెడ్డిపల్లె సమీపాన ఉన్న వంక ఉధృతంగా ప్రవహించిన పరిస్థితి. ఆ సమయంలో తండ్రీ కొడుకులు ఆవుల ఎర్రన్న యాదవ్, బాల మునీంద్రయాదవ్‌లు వంకకు పైన తమకు చెందిన గొర్రెలు ఉండటంతో అక్కడికి చేరుకునేందుకు వంకను దాటాలని ప్రయత్నించారు. కాకపోతే ప్రవాహం ఉధృతంగా ఉండటంతో నీళ్లలో కొట్టుకుని పోతుండగా, ఒక కంపచెట్టును ఆశ్రయించి ప్రాణాలు దక్కించుకున్నారు. ఆ విషయాన్ని గ్రామస్తులు గమనించి అప్పటి ఎంపీపీ బత్తల వీరయ్య యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి దృష్టికి ప్రమాద ఘటన గురించి తెలియజేశారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి బోట్ల సాయంతో తండ్రీకొడుకులను ప్రాణాలతో రక్షించారు.

వంక వస్తే అంత్యక్రియలకు ఆటంకం

ఓబుల్‌రెడ్డిపల్లెకు గ్రామ పరిసరాల్లో ఉన్న మొగమూరు వంక వర్షాకాలంలో అన్ని రకాల ఇబ్బందులను కలగజేస్తున్న పరిస్థితి. ఒక్కొక్కసారి ఈ వంక భారీ స్థాయిలో వర్షాలు కురిసినపుడు మూడు, నాలుగు రోజుల వరకు ప్రవాహం తగ్గే పరిస్థితి ఉండదు. అలాంటి సమయంలో గ్రామంలో ఎవరైనా మృతి చెందితే వంకను దాటేందుకు వీలుగాక వంకనీళ్లలోనే మృతదేహాలను వదిలి అంత్యక్రియలను పూర్తి చేయాల్సిన దుస్థితి నెలకొనేది.

చదువులకు తప్పని తిప్పలు

గ్రామంలో కేవలం 5వ తరగతి వరకే చదువుకునే వీలుంది. వర్షాకాలంలో అక్కడున్న వంక ప్రవాహంతో పై చదువులు చదివేందుకు తీవ్ర ఇబ్బందులు ఉండేవి. 5వ తరగతి తర్వాత 6వ తరగతి నుంచి పై తరగతులకు చదువుకునేందుకు వెళ్లేందుకు వేంపల్లె, వీరపునాయునిపల్లెకు వెళ్లాల్సి ఉంటుంది. వంక ప్రవాహం వల్ల చదువులకు తప్పని తిప్పలు కొనసాగేవి. చదువులు కుంటుపడేవి.

కోర్టు మెట్లెక్కిన కాంట్రాక్టర్

ఊరి మేలు కోసం వంతెన నిర్మాణం చేపట్టిన వీరయ్య యాదవ్ ఎన్నిమార్లు విన్నవించినా కూటమి ప్రభుత్వం బిల్లుల మంజూరు విషయంలో నిర్లక్ష్యం వహిస్తూ చివరకు ఒక్కపైసా కూడా చెల్లించకుండా మాటలతోనే సరిపెట్టారు. ఈ నేపథ్యంలో వీరయ్య యాదవ్ కోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చింది. గత ప్రభుత్వం చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తే ఎక్కడ వైఎస్ జగన్‌కు మంచి పేరు వస్తుందనే ఉద్దేశ్యంతో బిల్లులకు ఎగనామం పెట్టినట్లు తెలుస్తోంది. ఇవన్నీ పక్కనపెట్టి గ్రామ సమస్యను తీర్చేందుకు చేపట్టిన వంతెన నిర్మాణానికి కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య తీరింది



మొగమూరు వంక ప్రవాహంతో ఇబ్బందులు పడేవారం. గ్రామానికి రాకపోకల కోసం వంతెన నిర్మాణం చేపట్టడం ఆనందంగా ఉంది. వంతెన నిర్మాణానికి రూ. 57 లక్షలు మంజూరైంది. వంతెన నిర్మాణం పూర్తయి రాకపోకలు సాగుతున్నాయి. ఎన్నికల కోడ్ రావడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బిల్లుల మంజూరుకు ఆటంకం ఏర్పడింది.తర్వాత వచ్చిన కూటమి సర్కార్ బిల్లులు చెల్లించకుండా కాలాయాపన చేస్తోంది. దీంతో కోర్టు మెట్లు ఎ క్కాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– బత్తల వీరయ్య యాదవ్, మాజీ ఎంపీపీ, ఓబుల్‌రెడ్డిపల్లె

వైఎస్ జగన్ హయాంలో వంతెన నిర్మాణం

2023 నవంబరులో ఎట్టకేలకు ఆ గ్రామస్తుల ఇబ్బందులు తొలగేందుకు వంకకు అడ్డంగా వంతెన నిర్మాణం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి చొరవతో ఎంపీపీ బత్తల వీరయ్య యాదవ్ పట్టుదలతో వంతెన నిర్మాణానికి సీఎండీఏ ఫ్, జీజీఎంపీ కింద రూ. 57 లక్షలు మంజూరైంది. ఇది లా ఉండగా బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేసరికి అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో ఒక్క పైసా కూడా వీరయ్య యాదవ్‌కు అందలేదు. కానీ ఊరి మేలు కోసం ఇబ్బందులు ఉన్నప్పటికీ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ వంతెన నిర్మాణంతో ఆ గ్రామానికి 200 సంవత్సరాలుగా ఉన్న ఇబ్బందులు తొలగిపోయాయి. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎస్.పాలగిరి వద్ద నూతనంగా నిర్మించిన వంతెనను ప్రారంభిస్తున్న అప్పటి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి (ఫైల్)

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్య పరిరక్షణ

రాయచోటి జగదాంబసెంటర్ : ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులతో ఆరోగ్య పరిరక్షణ లభిస్తుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ తెలియజేశారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ఏడీ త్యాగరాజు రైతు బజార్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రత్యేక స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు ప్రకృతి వ్యవసాయ కూరగాయల వినియోగం వలన కలిగే లాభాలను వివరించారు. అనంతరం డీపీఎం వెంకటమోహన్ మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందులు లేకుండా ప్రకృతి విధానంలో పండే కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, అవి తినడం వలన రోగనిరోధకశక్తి పెరుగుతందని తెలిపారు. అదే విధంగా ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పవన్, పద్మావతి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి

చాపాడు : వైఎస్సార్ కడప జిల్లా అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి కోసంకృషి చేస్తానని ఆలయ ఈఓ శంకర్ బాలాజీ తెలిపారు. మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం ఈఓగా శంకర్ బాలాజీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్‌తో కలిసి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మెడికల్ సీట్లను వెనక్కి పంపిన దద్దమ్మ ప్రభుత్వం

- పులివెందుల మెడికల్ కళాశాల 90 శాతం పూర్తి
- కేవలం రూ.120 కోట్ల మేర పనులు పెండింగ్
- ప్రైవేటు పరం చేసేందుకు సిద్ధమైన కూటమి
- అలుపెరగని పోరాటాలతో అడ్డుకుంటాం
- వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల : పులివెందుల మెడికల్ కళాశాలకు 50 సీట్లు మంజూరైతే.. వద్దని వెనక్కి పంపిన దద్దమ్మ ప్రభుత్వమిదని కూటమిపై వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. సోమవారం పులివెందులలోని మెడికల్ కళాశాలను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, డీసీ గోవిందరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మెడికల్ కళాశాలలో పూర్తయిన నిర్మాణాలు, ఆసుపత్రి భవనాలు, నర్సింగ్ కళాశాలను పరిశీలిస్తూ.. పూర్తయిన భవనాలను మీడియా ప్రతినిధులకు చూపించారు. అనంతరం వారు మెడికల్ కళాశాల ఎదురుగా.. కళ్లు ఉండి చూడలేని సీఎం చంద్రబాబు డౌన్ డౌన్, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, రైతు విభాగపు నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, పులి సునీల్‌కుమార్, వేముల సాంబ శివారెడ్డి, సర్వోత్తమరెడ్డి, రసూల్, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, పులివెందుల నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పూర్తయిన పులివెందుల మెడికల్ కాలేజీ భవనాల వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు



మెడికల్ కళాశాల, వైద్యశాల పరిశీలనలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

వైఎస్ పేరు తొలగింపు సరికాదు



పులివెందుల మెడికల్ కాలేజీ, వైద్యశాలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు తొలగించారు. కానీ ప్రజల గుండెల్లో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.542 కోట్లు ఖర్చు పెట్టి పులివెందుల మెడికల్ కాలేజీ నిర్మించారు. ఇంకా రూ.120 కోట్లు ఖర్చు అయ్యే పనులను పూర్తి చేయకుండా కూటమి ప్రభుత్వం అమ్మకానికి సిద్ధంగా ఉంచింది.

\- పి.రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ

విష ప్రచారం



2024 మార్చిలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల మెడికల్ కాలేజీ ప్రారంభించారు. కాలేజీ, హాస్పిటళ్లకు కావాల్సిన ఎక్విప్‌మెంట్ మొత్తం వైఎస్సార్‌సీపీ పాలనలోనే వచ్చేసింది. రోజుకు ఓపీ 500 నుంచి 1000 మంది వరకు వైద్య సేవలు పొందుతున్నారు. టీడీపీ ఆ పార్టీ స్థానిక ఎమ్మెల్సీని పంపించి పులివెందుల మెడికల్ కాలేజీ పూర్తి కాలేదని విష ప్రచారం చేయిస్తోంది. ప్రజలను మభ్యపెట్టాలని చూడటం తగదు.

\- ఎస్‌బీ అంజద్ బాషా, మాజీ డిప్యూటీ సీఎం

పూర్తి కాకపోతే.. సీట్లు ఎలా కేటాయిస్తారు?



పులివెందుల మెడికల్ కళాశాలకు సీట్లు కేటాయిస్తే.. కూటమి వద్దని వెనక్కి పంపింది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వ్యవస్థ వచ్చి చూసి 50 సీట్లు కేటాయించిందంటే.. మెడికల్ కళాశాల పూర్తయినట్లా, పూర్తి కానట్లా? మెడికల్ కళాశాల పూర్తి కాకపోతే ఈ కళాశాలకు 50 సీట్లు ఎందుకు కేటాయిస్తారు. కోట్లు వెచ్చించి నిర్మిస్తే అందుబాటులోకి తెచ్చి మెరుగైన విద్య, వైద్యం అందివ్వాల్సింది పోయి ప్రైవేట్ పరం చేయడం ఏమిటి?

\- రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ప్రొద్దుటూరు

జగన్‌కు పేరు వస్తుందనే ఉద్దేశంతోనే..



సామాన్య ప్రజలకు విద్య, వైద్యం అందించాలన్న ఉద్దేశంతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశారు. వాటిని ప్రారంభిస్తే వైఎస్ జగన్‌కు మంచి పేరు వస్తుందన్న ఉద్దేశంతో ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర పన్నుతున్నారు. ప్రజలతో కలిసి అలుపెరని పోరాటాలు చేసి ప్రైవేటీకరణను అడ్డుకుంటాం. ప్రజలు కూడా అన్ని గమనిస్తున్నారు. త్వరలో కూటమికి బుద్ధి చెబుతారు.

\- రఘురామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మైదుకూరు

పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం



మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే.. పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుంది. కాలేజీలను అనుబంధంగా ఉన్న ఆస్పత్రులు కూడా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంతో.. ఉచిత వైద్య సౌకర్యం పేదలు కోల్పోతారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నడూ లేని విధంగా మెడికల్ కళాశాలలను నిర్మింపచేసి అభివృద్ధి దిశగా తీసుకుని వెళ్లారు.

\-పి.రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ

వైఎస్ కుటుంబానికి, చంద్రబాబుకు ఎంతో తేడా..



సమాజానికి ప్రాముఖ్యత ఇచ్చే విషయంలో వైఎస్ కుటుంబానికి, చంద్రబాబుకు ఎంతో తేడా ఉంది. ప్రభుత్వ ఆధీనంలోనే విద్య, ఆర్థిక రంగాలు ఉండాలని, వాటివల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలకు మేలు జరుగుతుందని వైఎస్ కుటుంబం పరితపించింది. కానీ సీఎం చంద్రబాబు ఎప్పుడూ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేయడమే పనిగా పెట్టుకుంటారు.

\- డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్సీ

17 మెడికల్ కళాశాలలు స్థాపన



వైఎస్ఆర్‌సీపీ పాలనలో 17 మెడికల్ కళాశాలలు స్థాపించారు. 2023- 24లో ప్రతి కళాశాలకు 150 సీట్ల చొప్పున 750 సీట్లు మొదటి సంవత్సరం వచ్చాయి. రెండవ సంవత్సరం 750 సీట్లు వచ్చాయి. మరో 5 కళాశాలలను అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో 5 కళాశాలలను ప్రారంచారు. అందుకు సంబంధించి పాడేరు, పులివెందుల మెడికల్ కళాశాల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కూడా ఇచ్చారు.

\- నాగార్జునరెడ్డి, డాక్టర్స్ విభాగపు జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ

క్లుప్తంగా

బాలికపై లైగింక దాడి

తంబళ్లపల్లె : మండలంలో ఓ బాలికపై ఓ బాలుడు లైగింక దాడికి పాల్పడిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ ఉమమహేశ్వరరెడ్డి కథనం మేరకు వివరాలు.. ఓ గ్రామానికి చెందిన బాలిక (6) అమ్మమ్మ వద్ద ఉంటోంది. అమమ్మ కూలీ పనులకు వెళ్లగా.. ఆదివారం సాయంత్రం అదే ఊరికి చెందిన బాలుడు (13).. ఒంటరిగా ఉన్న బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన అమమ్మకు ఏడుస్తూ జరిగిన అఘాయిత్యాన్ని ఆ బాలిక తెలిపింది. ఆ బాలుడి కోసం వెతకగా అప్పటికే అతడు ఇంటి నుంచి పరారయ్యాడు. బాధితురాలి అమ్మమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి బాలికను వైద్య పరీక్షల నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిద్దెపై నుంచి పడి వ్యక్తికి గాయాలు



గాయపడిన రెడ్డిశేఖర్

మదనపల్లె రూరల్ : మిద్దెపై నుంచి పడి వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. సూరపువారిపల్లె పంచాయతీ దయ్యాలపల్లెకు చెందిన కృష్ణప్ప కుమారుడు రెడ్డిశేఖర్(43) పశువులకు గడ్డి తెచ్చేందుకు మిద్దెపైకి వెళ్లాడు. గడ్డి తీసుకుని కిందకు దిగుతుండగా, ప్రమాదవశాత్తు కాలు జారి పై నుంచి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వివాహిత అదృశ్యం



గీత (ఫైల్)

ముద్దనూరు : మండలంలోని ఆరవేటిపల్లె గ్రామానికి చెందిన గీత అనే వివాహిత అదృశ్యమైనట్లు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు.. ఆరవేటిపల్లె గ్రామానికి చెందిన కత్తె జయసింహ కృష్ణ 2 ఏళ్ల క్రితం ముదిగుబ్బ మండలం మద్దన్నగారిపల్లె గ్రామానికి చెందిన గీతను పెళ్లి చేసుకున్నాడు. ఆదివారం జయసింహ పెద్దమ్మ చనిపోవడంతో ఆమెను చూడడానికి రాత్రి ఇంట్లోని వారందరూ వెళ్లారు. వారు ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత జయసింహ భార్య తాను కూడా మృతురాలిని చూసి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. రాత్రి 11 గంటల వరకు ఆమె ఇంటికి రాకపోవడంతో.. జయసింహ అక్కడికి వెళ్లి చూశాడు. అక్కడ తన భార్య కనిపించక పోవడంతో బంధువులతో కలిసి చుట్టుపక్కల విచారణ చేశాడు. అయినా ఆమె ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నా బిడ్డను కాపాడండి

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న నాగచైతన్య
- ప్రభుత్వం సహకరించాలంటూ తల్లి వేడుకోలు



బోన్ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న నాగచైతన్య

సుండుపల్లె : అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమారుడు నాగచైతన్య(15)కి మెరుగైన వైద్యం అందించి కాపాడాలని తల్లి బోనంశెట్టి సుమలత ప్రభుత్వం, దాతలను వేడుకుంటోంది. వివరాలలోకి వెళ్లితే.. సుండుపల్లె మండల పరిధిలోని దిన్నెమీద బలిజపల్లి గ్రామానికి చెందిన బోనంశెట్టి నాగచైతన్య ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పది రోజుల క్రితం తీవ్ర జ్వరం రావడంతో రాయచోటిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చూపించారు. జ్వరం తగ్గకుండా తీవ్రమైన కడుపునొప్పి రావడంతో.. మెరుగైన చికిత్స కోసం వేలూరు సీఎంసీకి తీసుకువెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించారు. అక్కడ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఇతనికి బోన్ బ్లడ్ క్యాన్సర్ వ్యాధిగా నిర్ధారించారు. చికిత్స కోసం దాదాపు రూ.60 లక్షల వరకు ఖర్చవుతాయని డాక్టర్లు చెప్పడంతో.. ఆ నిరుపేద కుటుంబ సభ్యులు ఎటూతోచని దీనస్థితిలో కుప్పకూలిపోయారు. తన భర్త జీవనోపాధి కోసం కువైట్ దేశంలో పని చేసుకుంటూ జీవనాన్ని నెట్టుకొస్తున్నాడని, తమ బిడ్డకు ఈ వ్యాధి రావడంతో ఏమి చేయాలో తమకు దిక్కు తోచడం లేదని ఆమె కన్నీటి పర్యంతమవుతోంది. ప్రభుత్వం తమ బిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలని ఆమె ప్రాధేయపడుతోంది. దాతలు కూడా ముందుకు వచ్చి తమ బిడ్డ వైద్యానికి సహాయం చేయాలని ఆమె వేడుకుంటోంది.

విద్యార్థి జీవితం అంధకారం

- రాయితో కొట్టడంతో చూపు కోల్పోయిన వైనం
- బి.కొత్తకోట విద్యాలయంలో ఘటన
- ఈ ఘాతుకానికి పాల్పడింది సిబ్బందే
- నిందితుడికి అండగా బీజేపీ నేతలు
- కేసు నీరుగార్చేలా పోలీసు అధికారులపై ఒత్తిళ్లు



శేషాద్రిరెడ్డి కుడి కంటికి అయిన తీవ్ర గాయం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : ఓ విద్యార్థి నిండు జీవితాన్ని, ఉజ్వల భవిష్యత్తును అంధకారం చేసిన ఘటనపై.. తక్షణమే స్పందించాల్సిన కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడమే కాకుండా.. కేసు నీరుగార్చే ప్రయత్నాలు సాగుతున్నాయి. అన్నమయ్య జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితున్ని కాపాడేందుకు కూటమి ప్రభుత్వ భాగస్వామ్య పార్టీ అయిన బీజేపీ నేతలు రంగంలోకి దిగారు. కఠిన చర్యలు వద్దంటూ పోలీసు అధికారులపై ఒత్తిళ్లు తీసుకురావడంతో.. బాధితులు పోలీసు ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. బాధితులు తెలిపిన, నమోదైన కేసు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

వాస్తవాలు దాచి పెట్టే యత్నం

అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె మండలం కాలాడివాండ్లపల్లెకు చెందిన కొండా అమరనాథరెడ్డి కుమారుడు కొండా శేషాద్రిరెడ్డి (11) బి.కొత్తకోట మండలం గట్టు గ్రామంలో వేదవ్యాస భారతి ట్రస్ట్ రిషి వాటిక గురుకులంలో మూడేళ్లుగా చదువుతున్నాడు. ఈనెల తొమ్మిదిన శేషాద్రిరెడ్డి తోటి విద్యార్థులతో కలిసి ఆడుకుంటుండగా.. గురుకులంలో పని చేస్తున్న సిబ్బంది వెంకటేష్ కోపంతో శేషాద్రిరెడ్డిపైకి రాయి విసరడంతో అది కుడి కంటిపై బలంగా పడింది. రాయి దెబ్బకు కన్ను దెబ్బతిని తీవ్ర రక్తస్రావం కావడంతో.. అక్కడే సొంత వైద్యం చేసినా రక్తస్రావం ఆగలేదు. ఈ విషయాన్ని అమరనాథరెడ్డికి ఫోన్‌లో చెప్పి మీ బిడ్డను తిరుపతి అరవింద హాస్పిటల్‌కు తీసుకెళ్తున్నామని, అక్కడికి రావాలని సిబ్బంది రాకేష్ చెప్పారు. ఏమి జరిగిందో చెప్పకుండా, ఆడుకుంటూ గాయపడ్డాడని నమ్మించే ప్రయత్నం చేశారు. రాకేష్ విద్యార్థి శేషాద్రిరెడ్డిని కారులో అరవింద హాస్పిటల్ తీసుకెళ్లగా వైద్య పరీక్షలు నిర్వహించారు. మరుసటిరోజు శస్త్ర చికిత్స చేశారు. అప్పటికి గురుకులం సిబ్బంది వాస్తవాలు దాచిపెట్టారు. ఆడుకుంటూ పడిపోయి గాయపడినట్టుగానే చిత్రీకరించే ప్రయత్నం చేశారు. అసలు విషయం బయట పడుతుందని సిబ్బంది ఆస్పత్రి నుంచి మెల్లగా జారుకున్నారు. శేషాద్రిరెడ్డి స్పృహలోకి వచ్చాక అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వెంకటేష్ రాయితో బలంగా విసరడంతో కంటికి తీవ్ర గాయమైనట్టు చెప్పారు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించినట్లు తెలిపారు. ఆస్పత్రి నుంచి డిశార్చ్ అయ్యాక రిషి వాటిక గురుకులం వద్దకు వెళ్లిన అమరనాథరెడ్డి తన బిడ్డకు ఎలా గాయమైందని ప్రశ్నించగా.. పొంతన లేని సమాధానాలు చెప్పి వాస్తవాన్ని దాచిపెట్టారు.

శాశ్వతంగా కన్ను పోయింది

అరవింద వైద్యులు శేషాద్రిరెడ్డిని పరీక్షించాక కుడి కన్నుకు అయిన తీవ్రమైన గాయం కారణంగా శాశ్వతంగా చూపు కోల్పోయాడని నిర్ధారించి అమరనాథరెడ్డికి చెప్పారు. ఇదే విషయాన్ని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో విద్యార్థి నిండు జీవితం బలైపోగా ఉన్నత భవిష్యత్తును కోల్పోయాడు. ఇప్పుడా విద్యార్థి పరిస్థితి దయనీయంగా మారింది. తనబిడ్డ చూపు కోల్పోవడానికి కారణమైన రిషివాటిక గురుకులం నిర్వహిస్తున్న వేదవ్యాస భారతీ ట్రస్ట్ నిర్వాహకులు, వెంకటేష్‌పై చర్యలు తీసుకోవాలని కె.అమరనాథరెడ్డి బి.కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. గురుకులానికి చెల్లించాల్సిన ఫీజు ఆలస్యం కావడంతో కక్ష కట్టి రాయి విసిరి తనబిడ్డ కుడి కంటిచూపు లేకుండా చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనబిడ్డ కుడి కంటి చూపు కోల్పోవడానికి కారణమైన వెంకటేష్‌ను ప్రశ్నిస్తే తనను చంపుతానని బెదిరించినట్టు పేర్కొన్నాడు.

బీజేపీ నేతల అండ

రిషివాటికలో వేద విద్యను అభ్యసిస్తున్న శేషాద్రిరెడ్డి కంటి చూపు కోల్పోవడానికి కారకుడైన వ్యక్తి, యాజమాన్యంపై బాధిత తండ్రి పోలీసులను ఆశ్రయించి న్యాయం కోసం ఆర్థిస్తే.. మదనపల్లె బీజేపీ నేతలు నిందితుడు, యజమాన్యాన్ని కాపాడేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కేసును నీరుగార్చడమే కాకుండా కేసు లేకుండా చేసే ప్రయత్నాలు జరిగాయి. ఘటన ఏడో తేదీన జరిగితే.. 14న కేసు నమోదైంది. కాగా బాధితునికి అండగా నిలవాల్సిన రాజకీయనేతలు.. నిందితునికి, గురుకుల యాజమాన్యానికి అండగా నిలుస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గురుకుల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న కొండా అమర్నాథరెడ్డి

కడప రూరల్ : తన కుమారుడు కన్ను పోవడానికి కారణమైన రిషి వాటిక వ్యక్తి వెంకటేష్ వేద వ్యాస భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే రిషి వాటిక గురుకుల యాజమాన్యంపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కొండా అమర్నాథ్‌రెడ్డి కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమారుడు అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండల పరిధిలోని గట్టు గ్రామం వద్ద ఉన్న శ్రీ వేద వ్యాసా భారతీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిషి వాటిక గురుకులంలో మూడవ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్నాడని తెలిపారు. ఇతర విద్యార్థులతో కలిసి ఆడుకుంటూ ఉండగా గురుకుల యాజమాన్యానికి సంబంధించిన వ్యక్తి వెంకటేష్ రాయితో తన కొడుకును కొట్టడంతో కన్ను పోయిందని ఆలస్యంగా తెలిసిందన్నారు. చికిత్స చేయించినా.. కంటి చూపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు కట్టలేదన్న కోపంతోనే ఈ ఘటన జరిగిందని తన కుమారుడు తెలిపారని చెప్పారు. విషయం తెలుసుకునేందుకు స్కూల్‌కు వెళితే తననే చంపుతానని బెదిరించారని చెప్పారు. తనకు, తన కుమారునికి గురుకుల యాజమాన్యం నుంచి ప్రాణహాని ఉందని పేర్కొన్నారు. పోలీసులు నామమాత్రం సెక్షన్ల కింద కేసు పెట్టి చేతులు దులుపుకొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను కోరారు.

ఎర్రచందనం దుంగల పట్టివేత

చాపాడు : మండల పరిధిలోని నాగులపల్లె చెరువు కట్టపై ఆదివారం సాయంత్రం తరలించేందుకు సిద్ధం చేసుకుంటున్న నాలుగు ఎర్రచందనం దుంగలను పట్టుకుని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. ఖాదరపల్లి గ్రామానికి చెందిన షేక్ షఫీ, జిలాని అనే వ్యక్తులు నాలుగు ఎర్రచందనం దుంగలను తరలిస్తుండగా దాడులు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. వారిని అరెస్టు చేసి, దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉరివేసుకుని విద్యార్థిని ఆత్మహత్య



లావణ్య మృతదేహం

రాయచోటి : ఏ కష్టం వచ్చిందో ఏ ఇబ్బంది కలిగిందో తెలియదు కానీ 8వ తరగతి చదువుతున్న రేకులకుంట లావణ్య(14) ఇంటిలోనే చీర కొంగుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సోమవారం ఉదయం ఈ సంఘటన రాయచోటి పట్టణంలో చోటుచేసుకుంది. ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి ఆత్మహత్యకు గల కారణాలను అన్వేషిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రాయచోటి పట్టణం ఎన్‌జీఓ కాలనీకి చెందిన మల్లికార్జున, అంజలిల కుమార్తె లావణ్య కొత్తపేట రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుండేది. సోమవారం ఉదయం 7 గంటలకే తండ్రి బేల్దారి పనికి, తల్లి ఇంటి పాచి పనులకు వెళ్లారు. వారికున్న ఇద్దరు పిల్లలను స్కూలుకు వెళ్లాలని చెప్పి.. ఇంటి నుంచి పనులకు వెళ్లిపోయారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో లావణ్య చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి అంజలి ఇళ్లలో పని ముగించుకుని 10 గంటలకు ఇంటికి వచ్చి చూడగా.. అప్పటికే ఆమె ఫ్యానుకు చీరతో ఉరివేసుకొని చనిపోయి ఉంది. సంఘటనపై కేసు నమోదు చేశామని, ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేస్తామని రాయచోటి అర్బన్ సీఐ బివి చలపతి తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం పీటీఎం మండలంలో జరిగింది. కందుకూరు పంచాయతీ గొల్లపల్లెకు చెందిన మధు భార్య గాయత్రి(33) కుటుంబ సమస్యలతో ఇంటి వద్దే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. పీటీఎం పోలీసులు విచారణ చేస్తున్నారు.

సౌత్‌జోన్ అండర్-23 మల్టీ డే మ్యాచ్‌లు ప్రారంభం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మల్టీ డే మ్యాచ్‌లు సోమవారం ప్రారంభం అయ్యాయి. కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు-చిత్తూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 89 ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 375 పరుగులు చేసింది.

వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో : వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-అనంతపురం జట్లు పోటీపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 364 పరుగులు చేసింది.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

మైదుకూరు : అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైదుకూరులో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మైదుకూరులోని ఎల్లమ్మ గుడి ప్రాంతంలో ఉన్న పట్టే రమేష్ (21) కొన్ని నెలల కిందట ఇల్లు కట్టుకునేందుకు రుణం తీసుకున్నాడు. పాత బట్టల వ్యాపారం చేసే ఈ యువకుడు అప్పు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడ్డాడు. రుణం చెల్లించే మార్గం లేక, ఇల్లు దక్కుతుందో లేదోననే భయంతో ఈ నెల 12వ తేదీన పురుగుల నివారణ మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఓబులేసు, తల్లి అయ్యవారమ్మ మైదుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్టీపీపీ నుంచి గుట్టుగా స్క్రాప్ తరలింపు



ఆర్టీపీపీ నుంచి బయటికి ట్రాక్టర్‌లో వచ్చిన స్క్రాప్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు పరిశ్రమ నుంచి గుట్టు చప్పుడు కాకుండా పాత ఇనుము (స్క్రాప్)ను కొందరు బయటికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆర్టీపీపీలోని 600 మెగావాట్ల ప్రాజెక్టు పనులు కొన్నేళ్ల కిందట పూర్తి అయ్యాయి. అందులో భాగంగా స్క్రాప్ (పాత ఇనుప ముక్కలు) నిలువ పేరుకుని పోయింది.

అయితే ఇలా పక్కన పడి ఉన్న స్క్రాప్‌ను పరిశ్రమ యజమాన్యం టెండర్ల ద్వారా అమ్మకం వీలు ఉన్నప్పటికీ.. ఏ కారణం చేతనో చర్యలు తీసుకోవడం లేదు. తాజాగా ఎన్‌డీఏ కూటమికి చెందిన కొందరు స్క్రాప్‌పై కన్నేశారు. సంబంధిత అధికారులకు రాజకీయ వత్తిళ్లు కూడా లేకపోలేదు. గుట్టు చప్పుడు కాకుండా స్క్రాప్ బయటకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని కార్మిక వర్గాల ద్వారా తెలుస్తోంది. తాజాగా ఆర్టీపీపీ నుంచి బయటికి వెళ్తున్న స్క్రాప్ వాహనాన్ని పట్టుకోవడం, వదిలి పెట్టడటం కూడా జరిగిందని తెలుస్తోంది. సంబంధిత అధికారులపై రాజకీయ వత్తిళ్లు రావడంతో ఆ వాహనాన్ని వదిలేసినట్లు ప్రచారం జోరుగా జరుగుతోంది. పట్టుకున్న వాహనం సచివాలయ వద్ద ఉంచి మంతనాలు చేసిన తర్వాత.. వదిలి వేసినట్లు సమాచారం. కూటమి నేతలు ఆర్టీపీపీని ఆదాయ వనరుగా మర్చుకున్న విషయం బహిరంగ రహస్యం. ఆర్టీపీపీలో పని చేస్తున్న కొందరి సహాయ సహకారాలు ఉండటం వల్ల స్క్రాప్ సులువుగా బయటకు పోతుంది. ఆర్టీపీపీ ప్రధాన గేట్ల వద్ద సీసీ కెమెరాలు ఉన్నాయని, ఏ విధంగా బయటికి పోతుందో సులువుగా తెలుసుకోవచ్చు. అయినా ఏ కారణం చేతనో సంబంధిత అధికారులు పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు విధినిర్వహణలో నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఈ విషయంపై ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావును వివరణ కోరాగా.. ఆరా తీస్తామన్నారు. ఈ వ్యవహారం తన దృష్టికి రాలేదన్నారు. ఏదిఏమైనా విచారణ చేస్తామని, సంబంధిత వారిపై చర్యలు ఉంటాయన్నారు. అనంతరం కలమల్ల ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. అయినా ఆర్టీపీపీలోని అన్ని విభాగాల అధికారులతో సంప్రదించి విచారణ చేస్తామన్నారు. ఆర్టీపీపీ అధికారులు ఫిర్యాదు చేయలేదన్నారు. ఫిర్యాదు చేస్తే విచారణ చేపడుతామని తెలిపారు.